ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 190

మంగళవారం 27 జనవరి 2026 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

### యువరాజ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ
## బ్రేక్ చేయడం అసాధ్యం

విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ కీలక వ్యాఖ్యలు



07



# అంబరాన్నింటిన గణతంత్ర వేడుకులు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

**ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన**

**ప్రత్యేక ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు**

**ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్**



దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది.

## ప్రత్యేక ఆకర్షణగా మోడీ తలపాగా

ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో మోడీ

పరేడ్ వివరాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ కనిపించిన ప్రధాని

3

## భారత్‌కు ప్రపంచదేశాల శుభాకాంక్షలు

చైనా, రష్యా, అమెరికా తదితర దేశాల సందేశాలు

### తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో

# పెరిగిన ఇమేజ్

### మూడు ఎకనమిక్ జోన్లుగా రాష్ట్ర విభజన

**సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి**

**మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయింపు**

**26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ**

**ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందచేత**

**గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**







**రోమింగ్ న్యూస్, హైదరాబాద్ :** భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని.. ఈ డాక్యుమెంట్ హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్టాన్ని

మిగతా 2 లో



## లోక్‌భవన్‌లో గవర్నర్ ఎట్ హోం

### హాజరైన మంత్రులు, ప్రముఖులు

హైదరాబాద్ రోమింగ్ న్యూస్ : రిపబ్లిక్ డే సందర్భంగా లోక్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం జరిగింది. నేతలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీజే ఏకే సింగ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కాంగ్రెస్, బీఆర్ఎస్, భాజపా నేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్‌ను జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. ఎట్ హోం సందర్భంగా రాజ్‌భవన్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# అమరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

### త్యాగధనుల బాటలో నడవడమే విద్యార్థుల కర్తవ్యం ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్





యాదగిరిగుట్ట,రోమింగ్ న్యూస్: “దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించి, మరణం తర్వాత కూడా అజరామరులుగా నిలిచిన అమరవీరుల ఆశయాలను కొనసాగించడమే మనం దేశానికి ఇచ్చే అసలైన గౌరవం” అని ఎస్.వీ.ఎన్ (సాఎచీ) డిజిటల్ స్కూల్ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్ లను గుర్తుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. మృత్యువు కళ్లముందు కనిపిస్తున్నా చెదరని చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన భగత్ సింగ్ ధైర్యం ప్రతి విద్యార్థిలో ఉండాలని ఆకాంక్షించారు. అల్లూరి సీతారామరాజు తెగింపు, చంద్రశేఖర్ ఆజాద్ పరాక్రమం నేటి తరానికి దిక్సూచి కావాలని పేర్కొన్నారు. అహింసతో పాటు అవసరమైనప్పుడు ఆయుధం పట్టిన విప్లవ వీరుల పోరాట ఫలితమే నేటి స్వేచ్ఛ అని, బ్రిటీష్ పాలకుల గుండెల్లో నిద్రపోయిన లాల్-బాల్-పాల్ (లాలా లజపతిరాయ్, బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్) త్రిమూర్తుల ఐక్యతను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.



### 30 ఏళ్ల విద్యా యజ్ఞం - సామాజిక బాధ్యత

ఎస్.వీ.ఎన్ స్కూల్ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని గుర్తుచేస్తూ, క్రమశిక్షణతో పాఠశాలను నడిపిస్తున్న ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి సేవలను ఆయన కొనియాడారు. ముఖ్యంగా లండన్ వంటి నగరాల్లో లక్షల రూపాయల జీతాన్ని వదులుకొని, గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభివృద్ధి కోసం పనిచేస్తున్న యువ డైరెక్టర్ గొట్టిపర్తి వృతిక్ సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
27 జనవరి
2026






# పద్మ అవార్డు ఘనత మీదే

**నన్ను ఆదరించిన తెలుగు ప్రేక్షకులదే.. నటకిరీటి రాజేంద్రప్రసాద్ వెల్లడి**

**హైదరాబాద్,జనవరి26 :** 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం పద్మ అవార్డు గ్రహీతల పేర్లు విడుదల చేయగా నటకిరీటి రాజేంద్రప్రసాద్ కి పద్మ శ్రీ లభించింది. తనకు పద్మశ్రీ అవార్డు రావడంతో రాజేంద్రప్రసాద్ స్పందించారు. నా ప్రాణానికి ప్రాణమైన తెలుగు ప్రేక్షక దేవుళ్ళందరికీ నమస్కారం. ఈ రోజు నా జీవితంలో ఎంతో సంతోషకరమైన రోజు. భారత ప్రభుత్వం నాకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది అని తెలిసినప్పటినుండి నా కళ్ళు ఆనందంతో నిండిపోయాయి. ఒక నటుడిని గుర్తించి ఇంతటి గొప్ప గౌరవాన్ని అందించిన భారత ప్రభుత్వానికి నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అలాగే నా పేరుని ఈ పురస్కారానికి సిఫార్సు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, పెద్దలందరికీ నా ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. కానీ నిజం చెప్పాలంటే అవార్డు నాది కాదు, మీది. 48 ఏళ్లుగా నన్ను ఒక నటుడి గానే కాకుండా, మీ ఇంట్లో ఒక మనిషిగా, మీలో ఒకటిగా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు. నేను నవ్వించిన, ఏడిపించిన, మా రాజేంద్రప్రసాద్ అని మీరు చూపించిన ఆప్యాయత నాకు దక్కిన నిజమైన అదృష్టం. ఆ ప్రేమే ఈరోజు నన్ను ఇక్కడ వరకు నడిపించింది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు నన్ను సొంత బిడ్డ లాగా ఆదరించారు. మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను. నాతోపాటు ఈ ఏడాది పద్మ పురస్కారాలను అందుకుంటున్న దేశంలోని మహానుభావులు అందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీ ఆశీస్సులు ఎప్పుడూ నామీద ఇలాగే ఉండాలి. బ్రతికున్నంత వరకు సర్వదా, మీ రాజేంద్రప్రసాద్.' అని పేర్కొన్నారు.

## మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు చిరు సత్కారం

**స్వయంగా ఇంటికి వెళ్లి శాలువ కప్పి సన్మానం**

**హైదరాబాద్,జనవరి26 :** తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు ప్రముఖులతో పాటు సీనియర్ నటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్‌లు పద్మశ్రీ అవార్డులకు ఎంపిక అయ్యారు. అయితే ఈ ఆనందాన్ని మరింత ప్రత్యేకంగా మార్చారు మెగాస్టార్ చిరంజీవి. చిరంజీవి స్వయంగా మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్‌ల నివాసాలకు వెళ్లి వారిని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపి తెలుగు సినిమాకు లభించిన ఈ జాతీయ గౌరవం ఒక మైలురాయిగా పేర్కొన్నారు. ఈ ముగ్గురి మధ్య జరిగిన ఆత్మీయ సంభాషణలు, దశాబ్దాల పాటు కలిసి ప్రయాణించిన అనుబంధాన్ని, పరస్పర గౌరవాన్ని ప్రతిబింబించాయి. 2006లో పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ అందుకున్న చిరంజీవి, ఇది చిత్ర పరిశ్రమకు నిజంగా ఒక ఆనందకరమైన రోజు అని అభివర్ణించారు. ఇదే సందర్భంలో సోషల్ మీడియా ద్వారా కూడా చిరంజీవి పద్మ అవార్డు పొందినవారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మమ్ముట్టీ, మాధవన్‌తో పాటు క్రీడారంగం నుంచి రోహిత్ శర్మ, వరల్డ్‌కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, అలాగే డాక్టర్ దత్తాత్రేయుడు నోరికి అభినందనలు తెలియజేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో పరిణామం

**బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్‌కు సిట్ నోటీసులు**

**హైదరాబాద్,జనవరి26 :** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావుకు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా, ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కీలక వాస్తవాలు సంతోష్ రావుకు తెలిసి ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, విచారణ నిమిత్తం జనవరి 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని జుబ్లీహిల్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి ఆదేశించారు. ఇప్పటికే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులను విచారించిన సంగతి తెలిసిందే. ఐటీ చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం వంటి కఠిన సెక్షన్ల కింద కొనసాగుతున్న ఈ విచారణలో సంతోష్ రావుకు నోటీసులు అందడం రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతోంది. రేపు మధ్యాహ్నం జరగబోయే ఈ విచారణలో సిట్ అధికారులు సంతోష్ రావు నుండి ఎటువంటి సమాచారాన్ని రాబడతారనే అంశంపై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## కర్రెగుట్టల్లో పేలిన మందుపాతరలు

**పదిమంది భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు**

**ములుగు,జనవరి26 :** తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలు పేలి 10 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. కర్రెగుట్టల్లో మావోయిస్టుల కదలిక, ఐఈడీలు అమర్చినట్లు భద్రతా సంస్థలకు విశ్వసనీయ సమాచారం అందడంతో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అనేక ఐఈడీలు ఒకదాని తర్వాత ఒకటి పేలాయి. దీంతో జవాన్లు గాయపడ్డారు. వారిని ఆర్మీ హెలికాప్టర్‌లో రాయ్‌పుర్‌కు తరలించారు. వీరిలో 9 మంది డీఆర్‌జీ, మరొకరు కోబ్రా బెటాలియన్‌కు చెందినవారు. గాయపడిన భద్రతా సిబ్బందికి ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కర్రెగుట్టల్లో హైఅలర్ట్ ప్రకటించి కూంబింగ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. గతేడాది ఇదే ప్రాంతంలో 21 రోజుల పాటు దేశంలోనే అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే.

## తలకిందులుగా జెండా ఆవిష్కరణ

మెదక్,జనవరి26(ఆర్ఎన్ఎ): మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో జాతీయ జెండా అవమానానికి గురైన ఘటన కలకలం రేపింది. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల సందర్భంగా ఆర్డీవో మహిపాల్ రెడ్డి జాతీయ జెండాను తలక్రిందులుగా ఆవిష్కరించడం వివాదానికి దారితీసింది. జెండా ఆవిష్కరణ అనంతరం అక్కడ ఉన్న స్థానికులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సూచించారు. దీంతో అప్రమత్తమైన ఆర్డీవో వెంటనే జెండాను సరిచేసి రెండోసారి సక్రమంగా ఎగరవేశారు. అయితే అప్పటికే ఈ ఘటనపై విమర్శలు మొదలయ్యాయి. జాతీయ జెండా ఆవిష్కరణ వంటి కార్యక్రమంలో ఈ తరహా నిర్లక్ష్యం ఎలా జరిగిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలోనే ఇలాంటి తప్పిదం జరగడం బాధాకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్

మొదటి పేజీ తరువాయి

మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని,



మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అ÷-దదె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.



# ఎన్నికల పక్రియలో పెరిగిన మహిళల భాగస్వామ్యం

**ఎన్నికల హామీలు అమలుకు నిలదీస్తున్న మహిళలు**

**ఐద్వా సమావేశంలో ప్రొఫెసర్ శాంతాసిన్హా**

**హైదరాబాద్,జనవరి26 :** దేశవ్యాప్తంగా ఎన్నికల పక్రియలో మహిళల భాగస్వామ్యం పెరుగు తున్నదని, పోలింగ్ కేంద్రాల్లో వారి ఓటింగ్ శాతమే అధికంగా ఉంటోందని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, ఐద్వా రిసెప్షన్ కమిటీ చైర్పర్సన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా తెలిపారు. ఎన్నికల హామీలు అమలు చేయకుంటే ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నది కూడా మహిళలేనని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా మహిళల్లో పెరుగుతున్న రాజకీయ చైతన్యానికి ఇది నిదర్శనమన్నారు. ఐద్వా 14వ అఖిల భారత మహాసభలో ఆమె స్వాగతోపన్యాసం చేశారు. మహిళా చైతన్యం మరింత విస్తరించాల్సి ఉందని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, మంత్రాల రాములమ్మ, సుగుణమ్మ, చాకలి ఐలమ్మ వంటి మహిళల పోరాట స్ఫూర్తి కొనసాగుతూనే ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దళిత మహిళలు పురుషులతో కలిసి పోరాడారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా వారు తమ ఇళ్లలోనే హింస, నిర్బంధాలను ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ ప్రతిఘటనే మహిళా వర్గపోరాట ఉద్యమాన్ని నిర్మించిందన్నారు. దేశవ్యాప్తంగా అనేకమంది మహిళలు మిల్లులు, పొలాలు, అసంఘటిత రంగాల్లో అణచివేతకు గురవుతున్నారని, వారికి అండగా ఐద్వా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరులోని మహిళా మిల్లు కార్మికులు పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా దృఢంగా నిలిచారని, కోల్కత్తాలో జ్యూట్ కార్మికులు సామూహిక తొలగింపులను ప్రతిఘటించారని, ముంబైలోని ధన్రాజ్ కాటన్ మిల్లులోని మహిళా కార్మికులు లేఆఫ్ కు వ్యతిరేకంగా పోరాడాలని, లాఠీఛార్జి నుంచి కూడా ఎదుర్కొన్నారని వివరించారు. పోరాటాలన్నీ మహిళాశక్తికి స్ఫూర్తివంతమైవన్నారు. 2024 లోక్సభ ఎన్నికల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారని. వారే నిర్ణయాత్మక



శక్తిగా మారుతున్నారని శాంతా సిన్హా పేర్కొన్నారు. ఈ ప్రమాదాన్ని గమనించే ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో మహిళల ఓట్లను తొలగించే చర్యలకు పాల్పడుతున్నారని వివరించారు. రాజ్యాంగం ప్రకారం లింగభేదం లేకుండా చట్టం ముందు అందరూ సమానమేనని, కానీ ఉపాధిలో, సమాన పనికి సమాన వేతనంలో భేదాలున్నాయని తెలిపారు. మహిళలకు ప్రసూతి ఉపశమనం, రాజకీయ ప్రాతినిధ్యం, గౌరవం వంటివి అవిశ్రాంత పోరాట ఫలితంగా వచ్చాయని గుర్తు చేశారు. మహిళల పోరాటాల ఫలితంగానే వరకట్నం, గృహహింస, లైంగిక హింసకు వ్యతిరేకంగా చట్టాలు సాధించుకోగలిగామన్నారు. మహిళా సాధికారతలో ప్రధానంగా పనిచేసే హక్కు, విద్యా హక్కు, ఆరోగ్య హక్కు విషయంలో అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయని వివరించారు. కులం, లింగం, తరగతి వంటి విభజన ద్వారా అత్యంత అవమానకరమైన, ఆసురక్షిత పనులకు మహిళలను పరిమితం చేస్తున్నారని, దీన్ని వ్యతిరేకించాలని కోరారు. దేశవ్యాప్తంగా అశా వం-కర్లు, అంగన్వాడీలు చేస్తోన్న పోరాటాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. అనేక రాష్ట్రాల్లో 8వ తరగతి తర్వాత పెద్ద సంఖ్యలో బాలికలు చదువు మానేస్తున్నారని, ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలు లేకపోవడం, రక్షణలేదని ప్రయాణం వంటి కారణాలు శ్రామిక తరగతి కుటుంబాలకు విద్యను దూరం చేస్తున్నాయని, ఫలితంగా బాల్య వివాహాలు పెరుగుతున్నాయని వివరించారు. దళిత, ఆదివాసీ బాలికలు ఈ ముప్పును తీవ్రంగా ఎదుర్కొంటున్నారన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు ప్రభుత్వాలవేనని స్పష్టం చేశారు. దీనికోసం పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు, పని స్థలం నుంచి వీధి వరకు సమిష్టి పోరాటాలకు 'ఐద్వా' మహాసభరూపకల్పన చేయాలని అభిలాషించారు. ఐద్వా అఖిల భారత మహాసభలో పలువురు సౌహార్ద సందేశాలు ఇచ్చారు. ఆలిండియా మహిళా సాంస్కృతిక సంఘటన్ అధ్యక్షులు శోభ మాట్లాడుతూ 21వ శతాబ్దంలో కూడా ఆడపిల్లను పుట్టనివ్వని దుస్థితిని చూస్తున్నామన్నారు. మహిళల పట్ల సమాజ దృక్పథం ఇంకా పాతకాలపు ఆలోచనలతోనే ఉందన్నారు.. భూస్వామ్య విలువలే అనుసరించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు కరువయ్యాయన్నారు. పెట్టుబడిదారీ విధానం వల్ల పేదరికం, నిరుద్యోగం వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. పాత కాలపు ఆలోచనలను విడనాడి భూస్వామ్య, పెట్టుబడిదారీ భావజాలాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని కోరారు. సమాజంలోని సమానత్వ భావనకు పెను ముప్పు పొంచి ఉందని ఆలిండియా ప్రోగ్రెసివ్ ఉమెన్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగమణి అన్నారు. మహిళలు పోరాటాల ద్వారా సాధించుకున్న పురోగతిని, కష్టార్జితాన్ని నిర్వీర్యం చేసేలా చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. ఆశారాం బాపు, కుల్దీప్ సింగ్ వంటి లైంగిక దాడి నిందితులను విడుదల చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.. రాజకీయాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం అనేది అందని ద్రాక్షలాగే ఉందన్నారు. తెలంగాణ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి విహారెడ్డికి సన్మానం ఐద్వా అఖిల భారత మహాసభ వేదికపై తెలంగాణ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి విహారెడ్డిని నాయకులు సన్మానించారు. ఆమె మరింత రాణించాలని ఆకాంక్షించారు.

# నిజామాబాద్ దాడి ఘటన దారుణం

**ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను పరామర్శించిన దామోదర**

**దాడికి కారకులను వదిలిపెట్టేది లేదన్న మంత్రి**

**హైదరాబాద్,జనవరి26 :** నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం పరామర్శించారు. సౌమ్యపై దాడి దురదృష్టకరమని మంత్రి విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎక్సైజ్, పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు మంత్రి. క్రమంలోనే నిజామాబాద్‌లో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని రాజ నర్సింహ అన్నారు. ఇందులు కారకులైన ప్రతి ఒక్కరినీ చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగైనప్పటికీ.. ఇంకా ఆమె కండిషన్ క్రిటికల్‌గానే ఉందని తెలిపారు. నిమ్స్‌లో సుశిక్షితులైన సీనియర్ వైద్యుల బృందం, సౌమ్యకు అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సౌమ్య సంపూర్ణంగా కోలుకుటుందని ఆశిస్తున్నామన్నారు. ఆమె కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. విధి నిర్వాహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. నిందితులపై ఇప్పటికే హత్యాయత్నం కేసు నమోదు చేయించామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. నిమ్స్‌లో సౌమ్యను పరామర్శించిన మంత్రికి ఆమె ఆరోగ్య పరిస్థితిని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వైద్యులు వివరించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
27 జనవరి
2026



# ఎస్.వీ.ఎన్‌లో ఘనంగా 77వ రిపబ్లిక్ డే వేడుకలు

**గుట్ట ఎస్.వీ.ఎన్ లో పతాకావిష్కరణ చేసిన ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్**

**త్యాగాల పునాదులపైనే నవ భారతం**

**ఎస్.వీ.ఎన్ లో చదివే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు**

**ప్రభుత్వ కార్యాలయాల్లో పతాకావిష్కరణలో పాల్గొన్న ఎస్.వీ.ఎన్ స్టూడెంట్స్**

యాదగిరిగుట్ట, జనవరి 26 (రోమింగ్ న్యూస్): యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ ఎస్.వి.ఎన్ (హెచ్చీ) డిజిటల్ హైస్కూల్ ఆవరణలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మిన్నంటాయి. సోమవారం ఉదయం పాఠశాల వ్యవస్థాపకులు మరియు కరస్పాండెంట్ గొట్టిపర్తి భాస్కర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కవాతు, దేశభక్తి గీతాల ఆలాపనతో పాఠశాల ప్రాంగణం మారుమోగిపోయింది.








### భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థులను ఉద్దేశించి గొట్టిపర్తి భాస్కర్ ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. స్వాతంత్రం అనేది ఊరికే రాలేదని, ఎంతో మంది వీరుల రక్తతర్పణంతో సిద్ధించిందని ఆయన గుర్తు చేశారు. కేవలం 23 ఏళ్ల వయసులోనే దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడిన భగత్ సింగ్ ధైర్యాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మృత్యువు కళ్ళముందు ఉన్నా చెదరని చిరునవ్వుతో అమరత్వం పొందిన ఆ వీరుని స్ఫూర్తితో విద్యార్థులు తమ తమ వైఖరిని (ఆటిట్యూడ్) మార్చుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

### రాజ్యాంగం - మనందరి రక్షాకవచం

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని, ఇది ఎంతో మంది మేధావుల మేధోమథనం నుండి పుట్టిన త్యాగఫలమని ఆయన కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుభవిస్తూనే, దేశం పట్ల మనకున్న ప్రాథమిక బాధ్యతలను నెరవేర్చడమే నిజమైన గణతంత్ర స్ఫూర్తి అని విద్యార్థులకు హితబోధ చేశారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించడమే మనం దేశానికి ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు.

### 30 ఏళ్ల నిరంతర విద్యా యజ్ఞం

ఎస్.వి.ఎన్ డిజిటల్ స్కూల్ స్థాపించి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. మూడు దశాబ్దాలుగా ఎన్నో సవాళ్లు ఎదురైనా, వెనకడుగు వేయకుండా నిస్వార్థంగా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. కేవలం విద్యనే కాకుండా, విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఈ ప్రయాణంలో తమ పాఠశాల సాధించిన విజయాలు యాదగిరిగుట్ట ప్రాంతానికే గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.

### మిషన్ 596తో విజయకేతనం

పదో తరగతి ఫలితాల్లో ఎస్.వి.ఎన్ స్కూల్ ప్రతి ఏటా సృష్టించే ప్రభంజనం గురించి ఆయన ప్రస్తావించారు. “మిషన్ 596” లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని, వరుసగా 30 ఏళ్ల పాటు ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ రికార్డు సృష్టించడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను అధిరోహించేందుకు నిరంతరం శ్రమిస్తామని హామీ ఇచ్చారు.




### వేడుకల్లో కోలాహలం

ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా మిఠాయిల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆటా, పాటలు అలరించాయి.

### నిబద్ధతకు నిదర్శనం ప్రిన్సిపల్ మాధురి

పాఠశాల క్రమశిక్షణ, విద్యా ప్రమాణాల వెనుక ప్రిన్సిపల్ మాధురి కృషి వెలకట్టలేనిదని భాస్కర్ ప్రశంసించారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆమె పడుతున్న శ్రమ అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఆమె త్యాగనిరతి వల్లే నేడు ఎస్.వి.ఎన్ స్కూల్ ఈ స్థాయిలో నిలబడిందని సగర్వంగా ప్రకటించారు.

### మాతృభూమి సేవలో వృతిక్ - యువతకు ఆదర్శం

నేటి యువత విదేశీ ఉద్యోగాల వెంట పరుగులు తీస్తుంటే, ఇంగ్లాండ్‌లో ఉన్నత చదువులు చదివిన గొట్టిపర్తి వృతిక్ అక్కడి లక్షల రూపాయల ఆదాయాన్ని వదులుకొని, సొంత ఊరిలో సేవ చేయాలని నిర్ణయించుకోవడం గొప్ప విషయమని భాస్కర్ తెలిపారు. గ్రామీణ విద్యార్థుల అభివృద్ధి కోసం ఆయన చూపిస్తున్న చొరవను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.




























ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

మంగళవారం
27 జనవరి
2026







# గణతంత్ర వేడుకల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు 'ప్రశంసా పత్రం'

**300 డ్రంకన్ డ్రైవ్ కేసుల పరిష్కారానికి గుర్తింపు**

యాదగిరిగుట్ట, జనవరి 26:(రోమింగ్ న్యూస్): 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒక ప్రత్యేక గుర్తింపు లభించింది. విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శించి, పెండింగ్ కేసుల పరిష్కారంలో కీలక పాత్ర పోషించిన యాదగిరిగుట్ట ట్రాఫిక్ కానిస్టేబుల్ కె.శ్రీధర్ (గ్రాజ 4573) గౌరవ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 మరియు 2025 సంవత్సరాలకు సంబంధించి సుమారు 300 డ్రంకన్ డ్రైవ్ కేసులు కోర్టులో పెండింగ్లో ఉన్నాయి. ఈ కేసుల సత్వర పరిష్కారానికి, న్యాయపరమైన ప్రక్రియను వేగవంతం చేయడంలో కానిస్టేబుల్ శ్రీధర్ విశేష కృషి చేశారు. ఆయన చొరవతో ఈ 300 కేసులు విజయవంతంగా క్లియర్ అయ్యాయి.

**గౌరవ పూర్వక సత్కారం**

సోమవారం యాదాద్రి భువనగిరి జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో, జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ గారు శ్రీధర్ సేవలను కొనియాడుతూ ఆయనకు మెరిట్ సర్టిఫికేట్‌ను అందజేశారు. విధి నిర్వహణలో ఇలాంటి నిబద్ధత ఇతర సిబ్బందికి మార్గదర్శకమని వారు పేర్కొన్నారు.

**అభినందనల జల్లు**

జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న కానిస్టేబుల్ శ్రీధర్‌ను యాదాద్రి ట్రాఫిక్ సీఐ ఎలగొండ కృష్ణ, ఎస్సైలు రాజు, దేవేందర్ మరియు ఇతర ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయం వ్యక్తిగతంగా శ్రీధర్‌కే కాకుండా యాదాద్రి ట్రాఫిక్ విభాగానికే గర్వకారణమని సీఐ కృష్ణ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# బోడుప్పల్ లోటస్ ల్యాప్‌లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు



బోడుప్పల్, రోమింగ్ న్యూస్: బోడుప్పల్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు 150 అడుగుల భారీ జాతీయ పతాకంతో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి గారు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, విద్య ద్వారానే సమాజంలో చైతన్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యంగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను విలువలతో కూడిన మేధావులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు, దేశభక్తి నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కో-అడ్మిన్ ఆఫీసర్ స్వర్ణలత, ఇన్‌చార్జ్‌లు షాను, మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రెడిటేషన్ కార్డు ఉంటేనే జర్నలిస్టా?

**'ప్రెస్' స్టిక్కర్ నిబంధన సరికాదు : టీడబ్ల్యూజేఎఫ్ నేత మామిడి సోమయ్య**

జనగామ, జనవరి 26: (రోమింగ్ న్యూస్ ) : అక్రెడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలకు 'ప్రెస్' అని రాసుకోవాలంటూ రాష్ట్ర సమాచార పౌరసంబధాల కమీషనర్ హుకుం జారీ చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. జర్నలిస్టులను, జర్నలిజం వృత్తికి అవమానించే విధంగా జారీ చేసిన సర్క్యులర్ ను వెంటనే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు సంక్షేమ పథకాలకు గుర్తింపు కార్డుగా జారీ చేసే అక్రెడిటేషన్ కార్డు ఉన్న వారే తమ వాహనాలకు "ప్రెస్"అని రాసుకోవాలనే నిబంధన సరైంది కాదని, ఈ సర్క్యులర్ నిబంధన ఇటు జర్నలిస్టుల సమాజానికి,అటు వారి వృత్తి స్వేచ్ఛకు భంగం కలిగేదిగా, అవమానకరంగా ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకంటే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే అక్రెడిటేషన్ కార్డు కలిగి ఉన్న జర్నలిస్టులు మాత్రమే జర్నలిస్టులు కాదని, అక్రెడిటేషన్ కార్డు లేని జర్నలిస్టులు చాలా మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల మంది జర్నలిస్టులు వుండగా, వీరిలో సగం మంది జర్నలిస్టులకు మాత్రమే ప్రభుత్వం అక్రెడిటేషన్ కార్డులు ఇస్తున్నదని, మిగతా సగం మంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఆర్ ఎన్ ఐ (ప్రస్తుత పీ ఆర్ జీఐ) రిజిస్ట్రేషన్ పొందిన మీడియా సంస్థలు, పత్రికల్లో పనిచేస్తున్న చాలా మంది జర్నలిస్టులు వారి వారి మీడియా సంస్థల గుర్తింపు కార్డులతో పనిచేస్తున్నారని అన్నారు. వీరందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఉండవని, అంత మాత్రాన ఆ జర్నలిస్టులను సమాజంలో జర్నలిస్టులే కాదనే విధంగా తమ వాహనాలకు ప్రెస్ స్టిక్కర్ పెట్టుకోవద్దంటూ ప్రభుత్వం నిబంధనలు విధించడం సరైంది కాదని అన్నారు. సమాజంలో నకిలీ జర్నలిస్టులను కట్టడి చేయడానికి వేరే రూల్స్ పెట్టి నియంత్రించవచ్చని, అలాంటి చర్యలకు తాము వ్యతిరేకం కాదని, కానీ ఆ పేరుతో అసలైన జర్నలిస్టులను అవమానించడం, అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికే అక్రెడిటేషన్ కార్డు లేని అనేక మంది జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనా సర్క్యులర్ "మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు"గా అంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొంది లక్షలాది రూపాయల పెట్టుబడితో నడుస్తున్న అనేక చిన్న మధ్య తరహా పత్రికలు రాష్ట్ర ప్రభుత్వ ఎంపానల్మెంట్ కాక, అక్రెడిటేషన్ కార్డులు లేక చితికిపోతున్నాయని, అటువంటి పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులను జర్నలిస్టులే కాదనే పద్దతిలో ఇలాంటి నిబంధనలు విధించడం అన్యాయమని ధ్వజమెత్తారు. రాష్ట్ర సమాచార శాఖ కమీషనర్ ద్వారా వెలువడిన ఈ సర్క్యులర్ నిబంధన ను వెంటనే ఉపసంహరించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.

# అంగరంగ వైభవంగా పాతగుట్ట అధ్యయనోత్సవాలు





**మూడో రోజుకు చేరిన అధ్యయనోత్సవాలు**

**మంగళవారం 'నూత్తందాది శాత్తుమొరై' పూజలతో ఉత్సవాలు ముగింపు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయ-ంమైన పూర్వగిరి(పాతగుట్ట) నరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న అధ్యయనోత్సవాలు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయం లో పురప్పాట్టు సేవ, తిరుమంజనం, దివ్య ప్రబంధ సేవాకాలం, నమ్మాళ్వార్ పరమపద ఉత్సవాలను ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యుల అర్చకత్వంలో అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నిత్య ఆరాధనల అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయంలోని స్వామివారి మూలవరు లకు 'తిరుమంజనం' వేడుకను ఆలయ సంప్రదాయ రీతిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పురప్పాట్టు సేవలో భాగంగా స్వామివారి సేవను ఆలయ మాడవీధుల్లో ఊరేగించి దివ్యప్రబంధ సేవాకాలం నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం ఆలయంలో స్వామివారికి నిత్యారాధనల తర్వాత దివ్య ప్రబంధ సేవాకాలం, నమ్మాళ్వార్ పరమపద ఉత్సవాన్ని అర్చకులు నయనానందకరంగా జరిపించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో యాదగిరీశుడిని ఆలయ తిరువీధుల్లో విహరింపజేసి 'పురప్పాట్టు' సేవను నిర్వహించారు.

**నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు**

మంగళవారం ఉదయం నిర్వహించే నూత్తందాది శాత్తుమొరై వంటి ప్రత్యేక పూజలతో అధ్యయనోత్సవాలకు పరిసమాప్తి పలకనున్నారు. అనంతరం ఈ నెల 28 నుండి పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.

# జనగామలో రెండు కోట్ల చేనేత రుణమాఫీ

**ఘనంగా గణతంత్ర దినోత్సవం**





జనగామ, జనవరి 26: (రోమింగ్ న్యూస్ ) : జనగామ జిల్లాలో దాదాపు రెండు కోట్ల రూపాయలకు పైగా సుమారు 300 మందికి చేనేత రుణమాఫీ పథకం కింద లబ్ధి చేకూరినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పేర్కొన్నారు. జనగామ జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ జిల్లాలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రసంగించారు. కలెక్టరేట్ తో పాటు స్థానిక, ధర్మ కంచ మినీ స్టేడియం లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలు పలువురిని అలరించాయి. జాతీయ జెండా ని ఆవిష్కరించిన కలెక్టర్ పోలీస్ గౌరవ వందన స్వీకరణ చేశారు. జిల్లా అభివృద్ధి పైన సమగ్ర సమాచారం తోపాటు గణతంత్ర దినోత్సవ సందేశాన్ని కూడా కలెక్టర్ ఇచ్చారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలతో స్టేడియం ఉత్సాహభరితంగా కనిపించింది. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు. వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు ద్వారా జిల్లాలో జరిగినసమగ్ర అభివృద్ధిని వివరించే ప్రయత్నం చేశారు. అన్ని రంగాల్లో జిల్లా లో అభివృద్ధి గణనీయం గా జరుగుతుందని, దీనికి అధికారులు అన్ని వర్గాల ప్రజల సహకారం పొందడం అదృష్టమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు 77 వ గణ తంత్ర దినోత్సవ వేడుకలలో ముందుగా పరేడ్ జరిగిన తర్వాత జిల్లా లోని వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని జిల్లా కలెక్టర్ వివరించారు.

చేనేత రుణ మాఫీ పథకం క్రింద 293 మందిలబ్ధిదారులకు గాను రూ.2,06,25,000/- రూపాయల చెక్కుని అందించారు ఆ తర్వాత వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి వివిధ శాఖలలో ఉత్తమ సేవలందిస్తున్న జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులకు, వారి సిబ్బంది కి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందించారు. చివరగా పోలీస్, వ్యవసాయం, ఉద్యనవన, జిల్లా గ్రామీణభివృద్ధి, మెప్మా, తదితర శాఖల వారు పెట్టిన స్టాల్స్ ని కలెక్టర్, అదనపు కలెక్టర్ లు,డీసీపీ పరిశీలించి.....ఏర్పాటు తీరును అభినందించారు ఈ కార్యక్రమం లో జనగాం శాసనసభ్యులు పల్లా రాజ్యశ్వర్ రెడ్డి, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, బెన్ షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఆర్డివో లబ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వారంలో నాలుగు లేగదూడలను చంపిన టైగర్

**యాదాద్రి జిల్లాలో కలకలం సృష్టిస్తున్న పెద్దపులి సంచారం**

**తుర్కపల్లి మండలం దత్తాయపల్లిలో పట్టపగలే లేగదూడను చంపిన పులి**

**లేగదూడలపై టైగర్ వరుస దాడులతో భయాందోళనలో రైతులు**

**ఈ నెల 17 నుండి జిల్లాలోనే సంచరిస్తున్న టైగర్**

**వారం నుండి పది కిలోమీటర్ల పరిధిలోనే సంచరిస్తున్న పులి**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. ఈ నెల 17న జిల్లాలోకి ప్రవేశించిన టైగర్.. పశువులపై దాడి చేసి చంపుతోంది. ఇప్పటివరకు రాత్రి వేళల్లో లేగదూడలపై అటాక్ చేసి చంపిన పులి.. తాజాగా సోమవారం తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామ శివారులో పట్టపగలే లేగదూడను కొరికి చంపింది. వివరాల్లోకి వెళ్తే.. దత్తాయపల్లి గ్రామానికి చెందిన గొట్టెం శ్రీశైలం, గుంటి మహేష్, ఆవుల శ్రీశైలంతో పాటు మరికొంత మంది రైతులు కలిసి.. పశువులను మేపడం కోసం సాయంత్రం పెద్దకంచెకు తీసుకెళ్లారు. రోజువారిలాగే పశువులను పెద్దకంచె వైపు వదిలి రైతులంతా ఒకచోట కూర్చొని ముచ్చట్లలో మునిగిపోయారు. ఉన్నపళంగా పశువులన్నీ బెదిరిపోయి పరుగు తీయడాన్ని గమనించిన రైతులు వెంటనే పశువుల వద్దకు పరుగెత్తుకు వెళ్ళి చూడగా.. అప్పటికే ఒక లేగదూడ విగతజీవిగా నేలపై పడి ఉంది. లేగదూడ మెడ వద్ద లోతైన గాయాలై చనిపోయి ఉండడంతో.. దాడి చేసింది పెద్దపులి అయింటుందని భావించి ఫారెస్ట్ ఆఫీసర్లకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా ప్రదేశానికి వెళ్లిన ఫారెస్ట్ ఆఫీసర్లు టైగర్ అటాక్ చేయడం వల్లే లేగదూడ చనిపోయిందని నిర్ధారించారు.

**ఇప్పటివరకు నాలుగు లేగదూడలను చంపిన టైగర్**

ఈ నెల 17న యాదాద్రి జిల్లాలోకి ఎంటర్ అయిన టైగర్.. వారం రోజుల వ్యవధిలోనే నాలుగు లేగదూడలను చంపింది. ఈ వారం రోజుల నుండి పెద్దపులి కేవలం పది కిలోమీటర్ల పరిధిలోనే సంచరిస్తుండడం ఆ ప్రాంత రైతుల్లో భయం రేపుతోంది. ఈ నెల 17న రాజాపేట మండలం బేగంపేట శివారులో పులి పాదముద్రలను గుర్తించిన ఫారెస్ట్ ఆఫీసర్లు.. రైతులను అలెర్ట్ చేశారు. పులి సంచరిస్తున్న ఆనవాళ్ళు కనిపించడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యవసాయ పనులు త్వరగా ముగించుకుని ఇండ్లకు వెళ్లాలని హెచ్చరించారు. ఈ క్రమంలో ఈ నెల 18న తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామ శివారులో రెండు లేగదూడలపై దాడి చేసి చంపింది. తర్వాత కొన్ని రోజుల పాటు పులి సంచారానికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్ళు లభించకపోవడంతో.. పులి వేరేచోటకు వెళ్లిపోయిందని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఈ నెల 25న యాదగిరిగుట్ట మండలం రాళ్లజనగాం శివారులో మరో లేగదూడను పెద్దపులి కొరికి చంపింది. మళ్లీ మర్నాడే(సోమవారం) దత్తాయపల్లిలో పట్టపగలే లేగదూడపై అటాక్ చేసి చంపింది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే నాలుగు లేగదూడలను పులి చంపడంతో.. శివారు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనుల కోసం బావుల వద్దకు వెళ్లాలంటేనే రైతులు వణుకుతున్నారు.

**పట్టపగలే పులి సంచారం.. రైతుల్లో భయాందోళన**

పెద్దపులి యాదాద్రి జిల్లాలోకి ప్రవేశించినప్పటి నుండి రాత్రి వేళల్లో మాత్రమే పశువులపై దాడి చేసి చంపింది. కానీ సోమవారం దత్తాయపల్లిలో పట్టపగలే లేగదూడపై దాడి చేసి చంపడంతో.. రైతులు, శివారు గ్రామాల రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో మాత్రమే పులి సంచరిస్తుండడంతో డే టైంలో వ్యవసాయ పనులను ముగించుకుని త్వరగా ఇండ్లలోకి చేరుకుంటున్నారు. కానీ సోమవారం పట్టపగలే లేగదూడను పులి చంపి అడవిలోకి పారిపోవడంతో.. రైతులు మరింత భయాందోళన చెందుతున్నారు. ఏ టైంలో ఎక్కడి నుండి పులి వస్తుందో.?, ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు వణికిపోతున్నారు. కాగా జిల్లాలోకి పులి ఎంటర్ అయినప్పటి నుండి బేగంపేట, ఇబ్రహీంపూర్, దత్తాయపల్లి, రాళ్లజనగాం శివారుల్లోనే సంచరిస్తుండడం.. ఈ గ్రామాల మధ్య కేవలం 10 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండడం ఈ ప్రాంత ప్రజలను మరింత భయపెడుతోంది. కాగా ఇప్పటివరకు పులిని రైతుల్లోగానీ, ఫారెస్ట్ అధికారుల్లో గానీ ప్రత్యక్షంగా ఎవరి కంటా పడలేదు. చనిపోయిన లేగదూడలకు అయిన గాయాల ద్వారా దాడి చేసింది పెద్దపులేనని ఫారెస్ట్ ఆఫీసర్లు నిర్ధారించారే తప్ప ఇప్పటివరకు టైగర్ ఎవరికి కనిపించలేదు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
27 జనవరి
2026







## స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేని బిజెపి

**ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు**

**ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత**

**గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో పిసిసి చీఫ్**

**హైదరాబాద్,జనవరి26 :** స్వాతంత్య ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని, కులాలు- మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మహేష్ గౌడ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని... సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కుల సర్వేతో యావత్ రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులగణన బిల్లులను బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ కోరారు. మహాత్ముడి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర పోరాటం విజయవంతమైందని, ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రాశారన్నారు. మహాత్మా గాంధీ కలలు నెరవేర్చే దూరదృష్టి ఉన్న వ్యక్తి నెహ్రూ అని ప్రశంసించారు. ఐరన్ లేడీ ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశానికి గట్టి పునాదులు వేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ అజారుద్దీన్, షబ్బీర్ అలీ సహా వీహెచ్, దానం నాగేందర్, సంపత్, కోదండరాం, బెల్లయ్య నాయక్, చిన్నారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

**అదేబాటలో కాంగ్రెస్ పాలకులు**

**బిజెపి కార్యాలయంలో జెండా ఎగరేసిన రామ్**



**హైదరాబాద్,జనవరి26 :** రాజ్యాంగంలో కల్పించిన మౌలిక హక్కులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాలరాశారని.. ఇందిరా, రాజీవ్ గాంధీల బాటలోనే రాహుల్ గాంధీ నడుస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. భారతీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని... ఇతర దేశాలకు చెందిన వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేశారని... నెహ్రూ రాజ్యాంగాన్ని పక్కకు పెట్టారని విమర్శించారు. మొదటిసారి రాజ్యాంగాన్ని అవమానించింది నెహ్రూ అని... అంబేడ్కర్‌ను అవమానించారని ఆరోపించారు. అంబేడ్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు.సీఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలంగాణ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లపాటు దేశాన్ని దోచుకుందని.. పేదలకు మేలు చేసే పథకాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని రాష్ట్ర బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అంబేడ్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించింది మోదీ ప్రభుత్వమని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులకు ఏమీ చేయలేదని, ప్రధాని కిసాన్ యోజన ద్వారా రైతులకు మోదీ మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలను తరిమికొట్టి బీజేపీని ఆదరించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఎంపీ లక్ష్మణ్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

## సేవాగుణం ఉంటేనే రాజకీయాల్లోకి రావాలి

**బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం**

**నిజామాబాద్,జనవరి26 :** ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉంటేనే రాజకీయాల్లోకి రావాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. రాజకీయాలంటే ఏదో అనుకుని ఆలామంది భ్రపడతారని అన్నారు. ప్రజలకు సేవచేయడం, ప్రధాన లక్ష్యం కావాలన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని 12వ వార్డు బేతాళ స్వామి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగిన నియోజకవర్గాల్లో బాన్సువాడ ఒకటన్నారు. పట్టణాభివృద్ధికి రూ.600 కోట్లు వెచ్చించామన్నారు. విద్య, వైద్యం సాగు, తాగునీటిలో ముందున్నామని పేర్కొన్నారు. తన కుటుంబంలో ఉన్న సౌకర్యాలు పేద ప్రజల ఇళ్లలో ఉండాలనే ఆలోచించనతోనే రెండు పడక గదుల నిర్మాణాలు చేపట్టామన్నారు. రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ బాలరాజ్, తనది ఒకే ఆశయమని, ప్రజలకు మరింత సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. గత మున్సిపల్ ఎన్నికల్లో వార్డు అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు జరిగితేనే ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత్ర**

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బీఆర్ఎస్‌లో చేరిన పలువురు చేవెళ్ల నేతలు**




**హైదరాబాద్,జనవరి26 :** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత పోషిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే.. మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే.. ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని.. ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు. కానీ యాదయ్య.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ అంటున్నారని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, యాదయ్యలు చిన్ననాటి నుంచీ దోస్తులని.. వీరిద్దరూ ఒకే బండిపై తిరిగేవారని కేటీఆర్ చెప్పుకొచ్చారు.చేవెళ్లలో ఐదేళ్ల అబ్బాయిని అడిగినా.. కాలె యాదయ్య పార్టీ మారాడనే చెబుతారన్నారు. కానీ స్పీకర్ మాత్రం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు.. తాము పార్టీ మారామని చెప్పే దమ్ములేదని కేటీఆర్ అన్నారు.ఎన్నికల ప్రచార సమయంలో చేవెళ్లలో దళితులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చాలా హామీలు ఇచ్చారని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు కాదు కదా.. కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. వృద్ధులకు పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరినీ కడుపులో పెట్టుకుని చూసేవారని వివరించారు. నాట్లు వేసే సమయంలో టింగ్ టింగ్‌మంటూ రైతుల అకౌంట్‌లలో రైతుబంధు పడేదంటూ ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే.. తమపై కేసులు పెట్టి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బూతులు తమకూ వచ్చన్న ఆయన.. మాట్లాడేందుకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. ప్రజల దయతో తామంతా మంత్రులమయ్యామని కేటీఆర్ చెప్పారు.

## మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**హుస్నాబాద్‌లో జెండా ఊపి**
**ప్రారంభించిన మంత్రి పొన్నం**




**సిద్దిపేట,జనవరి26 :** తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్ స్టేషన్‌లో మేడారం స్పెషల్ బస్సులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకుంటున్న పలు కీలక నిర్ణయాలను ఆయన వెల్లడించారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎక్కడా రవాణా ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4000 ఆర్టీసీ బస్సులను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఒక్క హుస్నాబాద్ డిపో నుండే మేడారానికి 50 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఎవరూ ఇబ్బంది పడకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంత్రి సూచించారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం అత్యంత సురక్షితమైనదని, ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సులకు ఒక ప్రత్యేక సౌకర్యం ఉందని మంత్రి వివరించారు. భక్తులు నడక సాగించే అవసరం లేకుండా, నేరుగా అమ్మవార్ల గద్దెల వరకు వెళ్లగలిగే రవాణా సౌకర్యం కేవలం ప్రభుత్వ బస్సులకే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ వాహనాలలో రద్దీ , ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ప్రజలు ఆర్టీసీని ఎంచుకోవాలని కోరారు. జాతరలో లక్షలాది మంది భక్తులు పాల్గొనే క్రమంలో చిన్న పిల్లలు తప్పిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిని నివారించేందుకు పోలీస్ శాఖ , ఆర్టీసీ సంయుక్తంగా ఒక వినూత్న చర్య చేపట్టాయి. జాతరకు వచ్చే ప్రతి చిన్న బిడ్డ చేతికి పేరు , తల్లిదండ్రుల ఫోన్ నంబర్ నమోదు చేసిన ఒక ప్రత్యేక బ్యాండ్‌ను కడతారు. ఒకవేళ రద్దీలో పిల్లలు తప్పిపోయినా, ఈ బ్యాండ్ ఆధారంగా వారిని వెంటనే తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి వీలవుతుంది. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. హుస్నాబాద్ నుండి ప్రారంభమైన ఈ బస్సు సర్వీసులు జాతర ముగిసే వరకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటాయని, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

## దేశ భద్రతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

**సురక్షిత నగరంగా**
**నిలబెట్టడానికి పోలీసు శాఖ కృషి**

**గణతంత్ర వేడుకల్లో నగర పోలీస్**
**కమిషనర్ సజ్జన్నార్**



**హైదరాబాద్,జనవరి26 :** దేశ భద్రత కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను దేశంలోనే కాదు.. అంతర్జాతీయ స్థాయిలో సురక్షిత నగరంగా నిలబెట్టడానికి పోలీసు శాఖ కృషి చేస్తోందని సీపీ సజ్జనార్ తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా పేట్లబురుజులోని కార్ హెడ్‌క్వార్టర్స్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన సీపీ.. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు అత్యంత పవిత్రమైనదని, స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. దేశ భద్రత కోసం వేలాది మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారని పేర్కొన్నారు. ఇందుకోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని వివరించారు. పోలీసింగ్‌లో మానవీయ దృక్పథం ఉందన్న ఆయన.. విక్టిమ్, సిటిజన్ సెంట్రిక్ అప్రోచ్‌తో బాధితులకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా బాధితుల ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేసే వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేశామని గర్వంగాపేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల కేసుల్లో తక్షణ చర్యలు, 24/7 స్పందన ఉంటుందని తెలిపారు. యాప్ ద్వారా ప్రజల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని సజ్జనార్ వివరించారు. కేసులు నమోదు చేయడమే కాదు.. బాధితులకు న్యాయం అందేవరకూ పోలీసులదే బాధ్యత అని స్పష్టం చేశారు. నేరాల నివారణెళి లక్ష్యంగా విధానాన్ని అనుసరిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ద్వారా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీ తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి చేశామని.. ప్రాణ రక్షణెళి ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు సీపీ. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టాలరెన్స్ దిశగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా, వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు బలమని, శాంతి భద్రతల పరిరక్షణలో టెక్నాలజీ వినియోగాన్ని పెంచామని చెప్పారు. ప్రజల సహకారంతోనే సురక్షిత సమాజం సాధ్యమని ఆయన అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ విలువల పట్ల అందరూ నిబద్ధత చూపాలని తెలిపారు. చట్టం అందరికీ సమానమని, న్యాయం అందరి హక్కు అని సజ్జనార్ స్పష్టం చేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
27 జనవరి
2026





# నేడు బ్యాంకుల సమ్మె

**స్తంభించనున్న పలు సేవలు!**

**వారానికి 5 రోజుల పని కోసం ప్రభుత్వ బ్యాంకుల సమ్మె**

**మంగళవారం దేశవ్యాప్తంగా సేవలకు అంతరాయం**

**వరుసగా మూడు రోజులు మూతపడనున్న బ్రాంచులు**

**ప్రైవేట్ బ్యాంకుల కార్యకలాపాలు యథాతథం**




**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలకు మంగళవారం అంతరాయం కలగనుంది. వారానికి ఐదు రోజుల పనిదినాలు డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (UFBU) సమ్మెకు పిలుపునిచ్చింది. ఆదివారం సెలవు, సోమవారం గణతంత్ర దినోత్సవం కావడంతో ఇప్పటికే రెండు రోజులు బ్యాంకులు మూతపడ్డాయి. ఇప్పుడు సమ్మె కారణంగా వరుసగా మూడో రోజు కూడా బ్రాంచ్ సేవలు అందుబాటులో ఉండవు. ఈ నెల 23న చీఫ్ లేబర్ కమిషనర్‌తో జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకే మొగ్గు చూపుతున్నట్లు బ్యాంకు సంఘాలు ప్రకటించాయి. ఈ సమ్మె ప్రభావంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB), బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రభుత్వ బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కు క్లియరెన్స్ వంటి సేవలు స్తంభించనున్నాయి. అయితే, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్ వంటి ప్రైవేట్ రంగ బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయి. వాటి ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొనడం లేదు. యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలకు పెద్దగా ఇబ్బందులు ఉ ండకపోవచ్చని అంచనా. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఏటీఎంలలో నగదు కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రభుత్వ బ్యాంకులు తమ కార్యకలాపాలపై సమ్మె ప్రభావం ఉండొచ్చని స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చాయి. ప్రతి నెలా మొదటి, మూడు, ఐదో శనివారాలు బ్యాంకులు పనిచేస్తున్నాయి. అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించాలన్నది ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్. దీనిపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో ఒప్పందం కుదిరినా, ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బంగ్లాదేశ్‌లో ఆందోళనలు

**ఇండియాకు తిరిగి వచ్చిన ఎన్టీపిసి ఇంజనీర్లు**



**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుసగా దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. అనేక చోట్ల హిందువులపై దాడులు చేస్తూ చంపేస్తున్నారు. వారి ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారు. దీంతో అక్కడి హిందువులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో పని చేస్తున్న భారతీయులు చాలా మంది ఇండియాకు తిరిగొచ్చేస్తున్నారు. ప్రైవేటు రంగంలోనే కాకుండా.. భారత రాయబార కార్యాలయంతోపాటు వివిధ రంగాల్లో పని చేస్తున్న కేంద్ర సంస్థల ఉ ద్యోగులు కూడా బంగ్లాను వీడుతున్నారు. తాజాగా 9 మంది ఎన్టీపీసీ ఇంజనీర్లు బంగ్లాదేశ్‌ను వదిలి ఇండియా వచ్చినట్లు తెలుస్తోంది. కేంద్ర విద్యుత్ రంగ సంస్థ అయిన ఎన్టీపీసీకి చెందిన ఉద్యోగులు కొందరు బంగ్లాదేశ్‌లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఇండియా-బంగ్లా మధ్య ఉన్న మైత్రి ప్రకారం బంగ్లాదేశ్ ఇండియా ఫ్రెండ్‌షిప్ పవర్ కంపెనీ నిర్వహిస్తున్న రాంపాల్ థర్మల్ పవర్ ఎ÷-లాంట్‌లో పని చేస్తున్నారు. అయితే, అక్కడ నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో తొమ్మిది మంది భారతీయ ఉద్యోగులు ఆ దేశాన్ని వీడి, శనివారం ఇండియా వచ్చినట్లు తెలుస్తోంది. దీనికి వారు అక్కడి అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని సమాచారం. అలాగే నోటీసులు కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. అక్కడి ఉ ద్యోగులను తనిఖీ చేయగా.. వారు విధులకు రాలేదని తెలియడంతో విచారించారు. వారు ఇండియా వెళ్లిపోయారని తెలిసింది. భోమ్రా మార్గం ద్వారా వారు ఇండియా వచ్చినట్లు గుర్తించారు. బంగ్లాలో ఉన్న భారత ఉద్యోగులకు ఇండియన్ ఎంబసీ ఇప్పటికే ఒక సూచన చేసింది. కుటుంబంతో కలిసి అక్కడ ఉండటం క్షేమం కాదని, కుటుంబాల్ని ఇండియాకు పంపించాలని సూచించింది. దీంతో రాయబార కార్యాలయంతోపాటు పలువురు ఉద్యోగులు తమ ఫ్యామిలీ మెంబర్స్‌ను ఇండియాకు పంపించారు.

# భారత్ నూలుపై సుంకాలు విధించాల్సిందే

**బంగ్లా వస్త్రవ్యాపారుల డిమాండ్**

**ఢాకా :** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా మహమ్మద్ యూనస్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి భారత్-బంగ్లాల మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలు వేగంగా క్షీణిస్తూ వచ్చాయి. మరోవైపు ఆ దేశంలోని హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు వ్యతిరేకంగా అక్కడి వస్త్ర పరిశ్రమ వర్గాలు మరో డిమాండ్‌ను తెర పైకి తీసుకువచ్చాయి. ఇప్పటివరకు భారత నూలుకు బంగ్లాదేశ్‌లో ఉన్న డ్యూటీ-ఫ్రీ సౌకర్యం తొలగించాలని పట్టుబట్టాయి. లేదంటే ఫిబ్రవరి 1 నుంచి కర్మాగారాలు మూసివేస్తామని బంగ్లా ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ మేరకు ఆ దేశ వాణిజ్యశాఖ నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు లేఖ అందినట్లు యూనస్ ప్రభుత్వం పేర్కొంది. జనవరి చివరి నాటికి భారత నూలుకు సుంకం లేని దిగుమతి సౌకర్యాన్ని ఉప సంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా అన్ని స్పిన్నింగ్ యూనిట్లలో కార్యకలాపాలు నిలిపేస్తామని దేశీయ మిల్లర్లు హెచ్చరించారు. చాలా ఏళ్లుగా సుంకం లేకుండా భారత్ నుంచి చౌకగా నూలును దిగుమతి చేసుకుంటుండడం వల్ల స్థానిక స్పిన్నింగ్ యూనిట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని వారు లేఖలో పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ వస్త్ర పరిశ్రమలో 12వేల కోట్ల కంటే ఎక్కువ విలువైన అమ్ముడుపోని నిల్వలు మిగిలిపోయాయని తెలిపారు. 50కి పైగా వస్త్ర పరిశ్రమలు మూసేయడం వల్ల వేలాదిమంది కార్మికులు నిరుద్యోగులుగా మారారన్నారు. మరోవైపు బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమ వర్గాల డిమాండ్‌ను అక్కడి వస్త్ర ఎగుమతిదారుల సంఘం వ్యతిరేకిస్తోంది. భారత్ నుంచి దిగుమతి చేసుకున్న నూలుతో పోలిస్తే స్థానికంగా ఉత్పత్తి చేస్తున్న నూలు ఖరీదైనదని ఎగుమతిదారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ దుస్తుల బ్రాండ్లు, మెరుగైన నాణ్యత విషయాల్లో ప్రపంచ దేశాలు భారత్‌లో ఉత్పత్తి అయ్యే నూలుకు ప్రాముఖ్యత ఇస్తాయన్నారు. ఇప్పుడు భారత్‌కు ఉన్న డ్యూటీ-ఫ్రీ సదుపాయాన్ని నిలిపివేస్తే అక్కడి నుంచి ఎగుమతులు తగ్గుతాయన్నారు. దీనివల్ల ప్రపంచ దుస్తుల మార్కెట్‌లో పోటీని బంగ్లాదేశ్ ఎదుర్కోలేదన్నారు.

# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు

**జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము**

**ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన**

**ప్రత్యేక ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు**

**ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్**



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేందుకు వేలాది మంది విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన పరేడ్ భారత సైనిక శక్తి పాటవాన్ని సగర్వంగా చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో వాడిన పలు ఆయుధ వ్యవస్థలను సైనిక దళాలు కర్తవ్యపథ్ వేదికగా అచ్చెరువొందేలా ప్రదర్శించాయి. ఈ కవాతులో తొలిసారిగా బ్యాటిల్ అరే ఫార్మేషన్‌లో నిర్వహించిన కవాతు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యుద్ధ క్షేత్రంలో సైన్యాల మోహరింపును పోలినట్టు పరేడ్ నిర్వహించడం అతిథులు ఆశ్చర్యపోయేలా చేసింది. ఈ పరేడ్‌లో త్రివిధ దళాలకు చెందిన 6,050 సైనికులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో సాగిన ఆయుధ ప్రదర్శన భారత సైనిక పాటవాన్ని జగద్విదితం చేసింది. ఈ వేడుకల సందర్భంగా నాలుగు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకగా నిలిచిన ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, బ్రహ్మోస్ క్షిపణి ప్రదర్శన, 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలిగే సూర్యాస్త్ర రాకెట్ లాంఛర్ అతిథులను ఆకట్టుకున్నాయి. అర్జున్ యుద్ధ ట్యాంకు ప్రదర్శన కూడా ప్రత్యేక అట్రాక్షన్‌గా నిలిచింది. భారత్‌కు అత్యంత కీలకంగా మారిన ఎస్-400 క్షిపణి నిరోధక వ్యవస్థను కూడా ప్రదర్శించారు. అపాచీ, ప్రచండ్ హెలికాప్టర్లు, వివిధ యుద్ధ విమానాల గగనతల విన్యాసాలు మెప్పించాయి. డ్రోన్ ప్రదర్శన కూడా పరేడ్‌లో జనాలను అమితంగా ఆకట్టుకుంది. ఈ కవాతులో కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ కూడా మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సైనిక కవాతుతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, కళా ప్రదర్శనలు దేశ సాంస్కృతిక వైవిధ్యతను చాటాయి. కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన 30 శకటాలు దేశ ఖ్యాతిని ఇనుమడింపచేశాయి. ఈ వేడుకల్లో దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది అతిథులు పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.



# అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు

**శుభాంశు శుక్లాకు అశోకచక్ర ప్రదానం**

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని అడుగుపెట్టిన తొలి భారతీయుడు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత శౌర్య పురస్కారం అశోక చక్రతో గౌరవించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కెప్టెన్ శుభాన్షు శుక్లాకు ఆమె ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు యాక్సియమ్-4 మిషన్ చేపట్టిన సమయంలో గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అసాధారణ ధైర్యంతో పాటు ఆయన సంకల్పానికి గౌరవంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 2025 జూన్‌లో 'యాక్సియమ్-4' మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా అడుగుపెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన అక్కడే ఉండి అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన కీలక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టం, మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పని చేస్తుందనే అంశాలపై ఆయన వీడియో చిత్రీకరించారు. అలాగే అంతరిక్షంలో మానవ వ్యోమగాముల పరిస్థితిపై సైతం ఆయన అధ్యయనం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను సందర్శించిన తొలి భారతీయుడిగావ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా రికార్డుకెక్కారు. భారత్ సొంతంగా చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు ఎంపికైన మరో వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ రెండో అత్యున్నత శౌర్య పురస్కారం 'కీర్తి చక్ర'ను అందజేశారు.

# ప్రత్యేక ఆకర్షణగా మోడీ తలపాగా

**ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో మోడీ**

**పరేడ్ వివరాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ కనిపించిన ప్రధాని**



**న్యూఢిల్లీ :** దేశంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. అయితే మరో అరుదైన దృశ్యం ఆవిష్కృతమయ్యింది. ఉ ర్సులాకు ప్రధాని మోడీ పరేడు వివరాలను ఎప్పటికప్పుడు వివరించారు. మోడీ వివరాలను ఆమె ఆసక్తిగా విన్నారు. ఇకపోతే ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా, ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్‌లతో అది ఆకర్షణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు.. అభిరుచి, ఉత్సుకత, ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుక కు తగ్గట్టుగా ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్‌సూట్స్‌కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు. ఐరోపా సమాఖ్యకు ఉర్సులా తొలి మహిళా అధ్యక్షురాలు. 2019లో తొలిసారి బాధ్యతలు చేపట్టిన ఆమె.. 2024లో రెండోసారి ఎన్నికయ్యారు. 2029 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. అంతకుముందు ఆమె 2005 నుంచి 2019 వరకు జర్మనీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. మరోవైపు, భారత్-ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ పర్యటనలో ఆ ఒప్పందం జరిగే అవకాశం ఉంది.

# భారత్‌కు ప్రపంచదేశాల శుభాకాంక్షలు

**చైనా, రష్యా, అమెరికా తదితర దేశాల సందేశాలు**

**న్యూఢిల్లీ :** భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల నుంచి శుభాకాంక్షల సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. చైనా, రష్యా, అమెరికా, ఫ్రాన్స్, ఈయూ, ఇరాన్, నేపాల్, ఆస్ట్రేలియా, భూటాన్ మొదలైన దేశాల నుంచి సందేశాలు అందాయి. భారత్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకొంటామని ఈసందర్భంగా ఆయా దేశాధినేతలు, మంత్రులు పేర్కొన్నారు. 'భారత్ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శు భాకాంక్షలు. చైనా, భారత్ ఎప్పటికీ మంచి పొరుగువారిగా,స్నేహితులుగా ఉంటాయి. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలను, సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని ఎదురుచూస్తున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సందేశమి÷-చారు. భారత ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్, ప్రపంచంలో పురాతన ప్రజాస్వామ్య దేశం యూఎస్‌ల మధ్య చరిత్రాత్మక సంబంధం కొనసాగుతోంది. రక్షణ, ఇంధనం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో భారత్ అమెరికాల మధ్య సహకారం మంచి ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నాం. రాబోయే రోజుల్లో ఉమ్మడి లక్ష్యాలను ముందుకుతీసుకెళ్లేందుకు ఎదురుచూస్తున్నాం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. భారత ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు. న్యూదిల్లీ అంతర్జాతీయ అజెండాలోని కీలక సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరిస్తోంది. భారత్‌తో ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విలువైనదిగా భావిస్తున్నాం. మా ఉమ్మడి ప్రయత్నాల ద్వారా బహుళ రంగాలలో నిర్మాణాత్మక, ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ తెలిపారు. భారతీయులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. గతంలో భారత్‌లో గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఎంతో విలువైన జ్ఞాపకం. భారత్, ఫ్రాన్స్‌ల బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఫిబ్రవరిలో కలుద్దాం అంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సందేశం వెలువరించారు. భారతీయులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఈ ఏడాది గణతంత్ర వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉంది. భారత్-ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా పయనిస్తున్నాం. ఐరోపా యూనియన్‌తో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత ముందుకువెళ్లాలని కోరుకుంటున్నాం యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
27 జనవరి
2026







# భారత్, పాక్ మ్యాచ్‌పై సందిగ్ధం

మరో రెండు వారాల్లో టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. ఈ మేరకు ఇప్పటికే అన్ని జట్లు తమ స్క్వాడ్‌లతో సిద్ధమయ్యాయి. అయితే, బంగ్లాదేశ్ జట్టు మాత్రం ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకుంది. ఇక అప్పటి నుంచి పాకిస్తాన జట్టు వింత ప్రకటనలతో టెన్షన్ పెంచుతోంది. ఇప్పటికే బంగ్లాకు మద్దతుగా టోర్నమెంట్ నుంచి తప్పుకుంటామని పుకార్లు రేకెత్తించడం, ఆపై ఐసీసీ హెచ్చరించడంతో కామ్‌గా స్క్వాడ్‌ను ప్రకటించింది. ఆ తర్వాత మరో కొత్త డ్రామకు తెరలేపింది. ఇప్పటికే బంగ్లాకు మద్దతు పలికి తలనొప్పులు తెచ్చుకున్న పాక్ జట్టు.. ఇప్పుడు సరికొత్త డ్రామకు ప్లాన్ చేసింది. ఫిబ్రవరి 15న భారత జట్టుతో జరగబోయే మ్యాచ్ నుంచి తప్పుకుంటామని, ఆ మ్యాచ్‌ను బహిష్కరించే ప్లాన్ చేస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్ మీడియా నివేదికల మేరకు పీసీబీ చెర్మన్ మొహ్సిన్ నఖ్వీతోపాటు పాక్ ప్రధాని సాబాజ్ షరీఫ్ జరపబోయే సమావేశంలో దీనిపై ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది. బంగ్లాకు మద్దతు తెలిపేందుకే ఇలాంటి నిర్ణయానికి ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాక్ మ్యాచ్ ఫిబ్రవరి 15న శ్రీలంకలో జరగాల్సి ఉంది. అయితే, పాకిస్తాన్ ఈ మ్యాచ్ నుంచి తప్పుకుంటే, ఐసీసీకి భారీగా ఆర్థిక నష్టం కలగనుంది. ఎందుకంటే, భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్ నుంచే ఐసీసీకి భారీగా డబ్బులు సమకూరనున్నాయి. టీ20 ప్రపంచకప్ ఫైనల్, సెమీస్ కంటే కూడా ఈ రెండు జట్లు ఢీ కొనబోయే మ్యాచ్‌లకే భారీగా రేటింగ్ రానుంది. దీనిని ఐసీసీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. మరి ఇలాంటి మ్యాచ్ విషయంలో పాక్ నిర్ణయంతో ఐసీసీ తీవ్రంగా పరిగణించే ఛాన్స్ ఉంది. కఠిన చర్యలు తీసుకోవచ్చు అని తెలుస్తోంది. బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకున్నప్పటి నుంచి పీసీబీతోపాటు పాక్ మాజీ ఆటగాళ్లు వింత ప్రకటనలతో వివాదాలు సృష్టిస్తున్నారు. బంగ్లాకు మద్దతుగా పాకిస్తాన్ జట్టు కూడా టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకోవాలని మాజీ కెప్టెన్ రషీద్ ఖాన్ సూచించాడు. పాక్ జట్టు తప్పుకుంటే, ఐసీసీతో పాటు భారత్‌కు భారీ నష్టమంటూ తెలిపాడు. ఈ క్రమంలో తాజాగా పాకిస్తాన్ టీం భారత్‌తో మ్యాచ్ నుంచి తప్పుకోవాలని వార్తలు వినిపిస్తున్నాయి. షాబాజ్, మొహ్సిన్ నఖ్వీల మధ్య సమావేశం తర్వాత పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో చూడాలి.



# యువరాజ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ బ్రేక్ చేయడం అసాధ్యం

## విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ కీలక వ్యాఖ్యలు

తన గురువు, టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ బ్రేక్ చేయడం అసాధ్యమని విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ అంగీకరించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా గౌహతి వేదికగా జరిగిన మూడో టీ20లో టీమిండియా 8 వికెట్ల తేడాతో గెలుపొందిన సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌ను 3–0తో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేసి అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా అర్ధ శతకం బాదిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచాడు. 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 68 పరుగులతో అజేయంగా నిలిచి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ అనంతరం తన ఇన్నింగ్స్ గురించి మాట్లాడిన అభిషేక్ శర్మ యువీ రికార్డ్‌ను బ్రేక్ చేయడం అంత ఈజీ కాదన్నాడు. ‘నా జట్టు నా నుంచి ఆశిస్తున్నది విధ్వంసకర బ్యాటింగే. ప్రతీసారి ఇలా ఆడటం అంత సులువు కాదు. యువరాజ్ సింగ్ 12 బంతుల్లో చేసిన ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డ్‌ను బ్రేక్ చేయడం అసాధ్యం. కానీ భవిష్యత్తులో ఏమైనా జరగవచ్చు.దూకుడుగా ఆడటం అనేది పూర్తిగా మానసిక స్థితి, సహచర ఆటగా నుంచి లభించే మద్దతుపై ఆధారపడి ఉంటుంది. బ్యాటర్లందరూ బాగా ఆడుతున్నారు. ఈ సిరీస్ ముందు ముందు ఇంకా సరదాగా సాగుతోంది. లెగ్‌సైడ్ వైపు ఆడటం అనేది ఫీల్డ్ ప్లేస్‌మెంట్ మీద ఆధారపడి ఉ ంటుంది. ఒకవేళ నాకు గ్యాప్ దొరికితే ఆఫ్ సైడ్ కూడా షాట్లు కొట్టగలను. నేను కేవలం ఫీల్డింగ్‌కు తగ్గట్లుగా ఆడాలనుకుంటాను.’అని అభిషేక్ శర్మ చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మ విధ్వంసానికి సూర్యకుమార్ యాదవ్ హాఫ్ సెంచరీ కూడా తోడవ్వడంతో 10 ఓవర్లలోనే న్యూజిలాండ్ విధించిన 154 పరుగుల లక్ష్యాన్ని 10 ఓవర్లలోనే అందుకుంది. అభిషేక్ శర్మ బ్యాటింగ్‌కు ఫిదా అయిన అతని మెంటార్ యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా కొనియాడుతూనే ఎగతాళి చేశాడు. తన ఫాస్టెస్ట్ టీ20 హాఫ్ సెంచరీ రికార్డ్‌ను అభిషేక్ శర్మ అందుకోలేదని రెచ్చగొట్టాడు. ‘అభిషేక్ శర్మ.. ఇప్పటికీ 12 బంతుల్లో 50 పరుగులు చేయడం నీ వల్ల కావడం లేదు కదా? కానీ బాగా ఆడావు – ఇలాగే కొనసాగించు.’అని ట్వీట్ చేశాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

# జట్టు ఎంపికలో నిలకడ ఉండాలి

## ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయొద్దు... టీమ్ ఇండియా సీనియర్ స్పిన్నర్ అశ్విన్



భారత తుది జట్టు ( ఎంపికపై సర్వత్రా చర్చ నడుస్తోంది. తాజాగా టీమ్ ఇండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జట్టులో ఒక కీలక ఆటగాడిని పక్కన పెట్టడం అంటే అది ‘సర్కస్ ఫీట్’ చేయడమేనని, అటువంటి సాహసాలు జట్టుకు నష్టం కలిగిస్తాయని అశ్విన్ హెచ్చరించారు. ప్రస్తుత న్యూజిలాండ్ పర్యటనలో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ వరుసగా విఫలమవుతుండటంతో అతనిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గత మ్యాచ్‌లలో తక్కువ స్కోరుకే అవుట్ అవ్వడంతో, మూడో టీ20లో అతని స్థానంలో ఇషాన్ కిషన్‌ను తీసుకోవాలని చాలామంది మాజీలు సూచిస్తున్నారు. అయితే, అశ్విన్ మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. ఒకట్రెండు మ్యాచ్‌లలో విఫలమైనంత మాత్రాన శాంసన్ వంటి ప్రతిభావంతుడైన ఆటగాడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా అశ్విన్ మాట్లాడుతూ.. “టీమ్ ఇండియా జట్టు ఎంపికలో నిలకడ ఉండాలి. ఒక ఆటగాడికి అవకాశం ఇచ్చినప్పుడు అతనికి తగినన్ని అవకాశాలు కల్పించాలి. కేవలం ఒక ఇన్నింగ్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం అంటే అది సర్కస్ ఫీట్ లాంటిదే అవుతుంది. ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. న్యూజిలాండ్ వంటి కఠినమైన జట్లపై ఆడుతున్నప్పుడు జట్టులో స్థిరత్వం చాలా అవసరం” అని పేర్కొన్నారు. అశ్విన్ విశ్లేషణ ప్రకారం.. సంజూ శాంసన్ బ్యాటింగ్ శైలి న్యూజిలాండ్ పిచ్‌లకు సరిపోతుంది. అతను షార్ట్ పిచ్ బంతులను సమర్థవంతంగా ఎదుర్కోగలడని, ఒక్కసారి లయ అందుకుంటే మ్యాచ్ ఫలితాన్ని మార్చగల శక్తి అతనికి ఉందని అశ్విన్ గుర్తు చేశారు. ఇషాన్ కిషన్ మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ, శాంసన్ కు మరిన్ని అవకాశాలు ఇస్తేనే అతను తనను తాను నిరూపించుకోగలడని, వరుసగా మార్పులు చేయడం వల్ల జట్టులో అభద్రతా భావం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్. కోచ్ గౌతమ్ గంభీర్ ఇప్పుడు ధర్మసంకటంలో పడ్డారు. ఒకవైపు ఇషాన్ కిషన్ గత మ్యాచ్‌లో అద్భుతమైన అర్ధ సెంచరీతో ఫామ్‌లోకి రాగా, మరోవైపు శాంసన్ వరుస డకౌట్లతో ఇబ్బంది పడుతున్నాడు. అశ్విన్ వంటి సీనియర్ ఆటగాడు బహిరంగంగానే శాంసన్ కు మద్దతుగా నిలవడంతో మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్, న్యూజిలాండ్ జట్లు ప్రస్తుతం సిరీస్‌లో సమానంగా ఉన్నాయి. నిర్ణయాత్మకమైన మూడో మ్యాచ్?లో గెలిచిన జట్టుకే సిరీస్ దక్కుతుంది. ఇటువంటి కీలక సమయంలో ప్రయోగాలు చేయకుండా, నమ్మకమైన ఆటగాళ్లతోనే బరిలోకి దిగాలని అశ్విన్ సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలను పక్కన పెట్టి, ఆటగాడి ప్రతిభను నమ్మి అవకాశం ఇవ్వడమే సరైన క్రీడా స్ఫూర్తి అని ఆయన స్పష్టం చేశారు.

# బుమ్రాకు విశ్రాంతి అవసరమా..?

## మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర ఆగ్రహం



భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న ప్రతిష్టాత్మక టీ20 సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌కు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను పక్కన పెట్టడంపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. “వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్” పేరుతో జట్టు యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన ధ్వజమెత్తారు. బుమ్రా ఇప్పుడే సుదీర్ఘ విరామం తర్వాత జట్టుతో కలిశారని, కేవలం ఒక మ్యాచ్ ఆడిన వెంటనే అలసిపోయేంత పనిభారం ఏముందని సూటిగా ప్రశ్నించారు. కీలకమైన సిరీస్ జరుగుతున్నప్పుడు ప్రధాన బౌలర్‌కు విశ్రాంతి ఇవ్వడం వల్ల జట్టు సమతుల్యత దెబ్బతింటుందని, ఇది అభిమానులను నిరాశకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం ఆడే మ్యాచ్‌ల కంటే ఐపీఎల్ లేదా ఇతర లీగ్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఒక ఫాస్ట్ బౌలర్ రిథమ్ అందుకోవాలంటే వరుసగా మ్యాచ్‌లు ఆడాలని, ఇలా విడతలవారీగా ఆడిస్తే ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీల్లో ఇబ్బందులు తప్పవని కైఫ్ హెచ్చరించారు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ కైఫ్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “అసలు దేనికి విశ్రాంతి? ఏం పని చేశారని ఒత్తిడి అంటున్నారు? మైదానంలో దిగి వికెట్లు తీస్తేనే ఆత్మవిశ్వాసం వస్తుంది. నెట్స్‌లో ఎంత సేపు బౌలింగ్ చేసినా మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోతే ప్రయోజనం ఉండదు” అని ఆయన తేల్చిచెప్పారు. సీనియర్లు లేకపోవడం వల్ల యువ బౌలర్లపై అదనపు భారం పడుతుందని, అది వారి ప్రదర్శనపై ప్రభావం చూపుతుందని విశ్లేషించారు. జట్టు యాజమాన్యం మాత్రం రాబోయే టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని బుమ్రాను రొటేషన్ పద్ధతిలో వాడుతున్నట్లు తెలుస్తోంది. అయితే కైఫ్ ఈ వాదనను పూర్తిగా తప్పుబట్టారు. గతంలో కూడా ఇలాంటి ప్రయోగాల వల్లే కీలక సమయాల్లో టీమిండియా చేతులెత్తేసిందని గుర్తు చేశారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు ఆడుతున్నప్పుడు కేవలం బౌలర్లకు మాత్రమే ఎందుకు ఆంక్షలు విధిస్తున్నారని ఆయన నిలదీశారు. సోషల్ మీడియాలో కూడా కైఫ్ వ్యాఖ్యలకు అనూహ్య స్పందన లభిస్తోంది. సొంతగడ్డపై సిరీస్ గెలవాల్సిన సమయంలో ఇలాంటి నిర్ణయాలు సరికాదని క్రికెట్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. బుమ్రా లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని, కివీస్ బ్యాటర్లను కట్టడి చేయడంలో భారత బౌలర్లు తడబడుతున్నారని విశ్లేషకులు అంటున్నారు. ఈ వివాదంపై టీమ్ మేనేజ్‌మెంట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# చివరి 2 టీ20లకు తిలక్ వర్మ దూరం..

తెలుగు తేజం, టీమిండియా స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ మరికొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో చివరి రెండు టీ20లకు అతడు అందుబాటులో ఉండదని బీసీసీఐ సోమవారం ధృవీకరించింది. జనవరి 7న రాజ్‌కోట్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న 23 ఏళ్ల తిలక్ వర్మ పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరింత సమయం పడుతుంది. తిలక్ వర్మ ఇటీవల జనవరి 7న రాజ్‌కోట్‌లో పొత్తికడుపు సమస్యతో చిన్న సర్జరీ చేయించుకున్నాడు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. తిలక్ ఆరోగ్యంగానే ఉన్నాడు. కానీ ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం అతడు కొన్ని రోజులు మ్యాచ్‌లు ఆడే అవకాశం లేదు. టీ20 వరల్డ్ కప్ కోసం అతడు మరింత ఫిట్, ఆరోగ్యంగా ఉండాలని భావించిన బీసీసీఐ మేనేజ్‌మెంట్, కోచ్ తిలక్ వర్మకు విశ్రాంతినిచ్చారు. ఫిబ్రవరిలో జరగనున్న ప్రపంచ కప్ కోసం ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ చివరి రెండు మ్యాచ్‌లకు సైతం అతడు అందుబాటులో ఉండడని తెలిపారు. భారత అభిమానులకు శుభవార్త. తిలక్ వర్మ ఫిబ్రవరి 3న ముంబైలో జాతీయ జట్టుతో కలవనున్నాడు. ఫిబ్రవరి 7న ప్రారంభమయ్యే 2026 ఐసిసి పురుషుల టీ20 ప్రపంచ కప్‌కు ముందు జరిగే వార్మప్ మ్యాచ్‌లకు స్టార్ బ్యాటర్ అందుబాటులో ఉంటాడని తెలుస్తుంది. “తిలక్ వర్మ జనవరి 7, బుధవారం నాడు రాజ్‌కోట్‌లో పొత్తికడుపు సమస్య రావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. తరువాత శుక్రవారం హైదరాబాద్‌కు తిరిగి వెళ్లాడు. ప్రస్తుతం తిలక్ ఆరోగ్యంగా ఉన్నాడు. వేగంగా కోలుకుంటున్నాడు’ అని బీసీసీఐ గతంలో ఒక అప్‌డేట్‌లో తెలిపింది. పూర్తిగా కోలుకోవడంతో పాటు ఫిట్ నెస్ ముఖ్యమని, త్వరలో అతడు జట్టుతో కలుస్తాడని బీసీసీఐ పేర్కొంది. తిలక్ దూరం కావడంతో, న్యూజిలాండ్ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు అతని స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌ను కొనసాగించాలని సీనియర్ మెన్ సెలక్షన్ కమిటీ సిఫార్సు చేసింది. అయ్యర్ సిరీస్ లో కొనసాగనున్నాడు. జట్టు యాజమాన్యం ఇషాన్ కిషన్‌ను నెం. 3 స్థానంలో బ్యాటింగ్ చేపిస్తుంది. అయితే మొదటి మూడు మ్యాచ్‌ల్లో పూర్తిగా విఫలం కావడంతో సంజూ శాంసన్ పై ఒత్తిడి పెరిగింది. చివరి రెండు టీ20ల్లోనూ సంజూ ఇలాగే ఆడితే టీ20 వరల్డ్ కప్ లో శాంసన్ తుది జట్టులో ఉండటం కష్టమే. ఇషాన్ కిషన్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాడు. వరల్డ్ కప్ లో తిలక్ వచ్చాక కిషన్ బెంచ్ మీదకు వెళ్లక తప్పదు. కానీ సంజూ శాంసన్ ఫామ్, ఆటతీరు చూసి మేనేజ్‌మెంట్ కరుణిస్తే తుది జట్టులో ఇషాన్ కిషన్ వికెట్ కీపర్ బ్యాటర్ గా సేవలు అందించనున్నాడు.



# తుదిదశకు డ్రాగన్ షూటింగ్

## జూన్ 25న విడుద లచేసేలా ప్లాన్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్-ఇండియన్ సినిమా పై తాజాగా క్రేజీ అప్‌డేట్ బయటికి వచ్చింది. వర్కింగ్ టైటిల్: డ్రాగన్ పేరుతో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో దూసుకుపోతోంది. తాజాగా ఈ సినిమా ప్రస్తుత షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో ఎక్కువగా నైట్ ఎఫెక్ట్‌తో నైట్ షూటింగ్ నిర్వహించారని టాక్. తదుపరి షెడ్యూల్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ అంటేనే భారీ యాక్షన్, డార్క్ టోన్, పవర్‌ఫుల్ ఎలివేషన్లు గుర్తుకు వస్తాయి. అదే ఫార్ములాను ఈసారి ఎన్టీఆర్ స్థాయికి మించి చూపించేందుకు దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ప్యూర్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో యాక్షన్ సీక్వెన్సులు అత్యంత ఇంటెన్స్‌గా ఉండబోతున్నాయట. ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ యాక్షన్ రోల్స్‌లో ఇది ఒకటిగా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటి వరకు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన అన్ని సినిమాల్లోకెల్లా ఇదే బెస్ట్ మూవీ అవుతుందన్న అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లో టాప్ ప్రొడక్షన్ హౌసెస్‌గా గుర్తింపు పొందిన మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. భారీ బ్జడెట్‌తో, పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రవి బస్రూర్ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్, కీలక పాత్రలో అనిల్ కపూర్ కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని భాషల్లో ప్రేక్షకులను ఆకట్టుకునేలా పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది. జూన్ 25 సినిమాని విడుదల చేసే ప్లాన్ చేస్తున్నారు.



# చిత్రపరిశ్రమకు వచ్చే వారిని ప్రోత్సహించాలి

## ఇక్కడ కాస్ట్ కౌచింగ్ అంటూ ఏదీ లేదు



సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి పనిచేస్తానని ఏ ఆడబిడ్డ, మగబిడ్డ అయినా అంటే వారిని ప్రోత్సహించి పంపాలని, తెలుగు సినీ ఇండస్టీ గొప్పదని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. జీవితాంతం ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' భారీ విజయాన్ని అందుకుని రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో చిరంజీవి మాట్లాడారు. మళ్లీ విజయోత్సవాలను జరుపుకొనే వైభవాన్ని తీసుకొచ్చిన ఘనత దర్శకుడు అనిల్ రావిపూడికి దక్కుతుంది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన తెలుగు సినీ ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమా టీమ్ విజయానందాన్ని అనుభవిస్తుంటే, నాకూ సంతోషంగా ఉంది. అనిల్‌ను చూస్తుంటే రాఘవేంద్రరావుగారు గుర్తుకు వచ్చేవారు. రోజూ సెట్‌లో వినోదాన్ని పంచేవారు. ఈ మూవీ షూటింగ్‌కు వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ప్రతి సినిమా కష్టపడి పనిచేస్తాం. కానీ, కొన్ని సినిమా ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తాయి. అలాంటిదే ఈ మూవీ. ఈ సంక్రాంతికి దాదాపు అన్ని సినిమాలను ఆదరించారు. సినిమాలో వెంకీ ఉండాలని కోరుకున్నా. దాన్ని అనిల్ సాకారం చేశాడు. ఎంత పెద్ద స్టార్‌నైనా హ్యాండిల్ చేసే సామర్థ్యం అనిల్ రావిపూడికి ఉంది. మళ్లీ అనిల్‌తో చేసే అవకాశం మా ఇద్దరిలో ఎవరికి వస్తుందో చూడాలి.' ఇక నా కుమార్తె ఇండస్ట్రీలోకి వస్తానంటే ప్రోత్సహించిన తొలి వ్యక్తి మా అబ్బాయి రామ్‌చరణ్. 'రంగస్థలం' కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పనిచేసింది. కష్టం ఒక్కటే ఆయుధమని తెలుసుకున్న వ్యక్తి నా కుమార్తె సుస్మిత. సినీ ఇండస్టీ అద్దంలాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితాన్నే ఇస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలన్నారు.. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు. నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది. ఇందులో చేసిన ప్రతి నటుడు, సాంకేతిక నిపుణుడు ఎంతో ఉత్సాహంగా నటించారు. నయనతార సినిమాలో చేయడమే కాదు, ప్రమోషన్స్ కూడా చేసింది. ఆ మెరిట్ కూడా అనిల్‌కే దక్కుతుంది. సినిమా పరుగులు పెట్టడానికి ఎడిటర్ తమ్మిరాజు కారణం. ఇటీవల ఒకామె మాట్లాడిన వీడియో చూసి, భావోద్వేగానికి గురయ్యా. 'ఏమయ్యా.. చిరంజీవి ఎప్పటి నుంచో కష్టపడుతూనే ఉన్నావు. మమ్మల్ని ఆనందింపజేయడానికి ఓపిక ఉన్నా లేకపోయినా ఇప్పటికీ అలాగే పనిచేస్తున్నావు. డబ్బుల కోసం నువ్వు పనిచేస్తున్నావని నేను అనుకోను. నువ్వు ఇలా కష్టపడుతుంటే నాకు బాధగా ఉంది' అని అన్నారు. నిజంగా ఆ తల్లికి ఈ సభాముఖంగా ధన్యవాదాలు చెబుతున్నా. చిరంజీవి మమ్మల్ని అలరించాలనే కోరుకునే మీ పాజిటివ్ ఎనర్జీ నుంచే నాకు ఈ శక్తి వస్తోంది. ఈ జన్మ ఉన్నంత వరకూ మిమ్మల్ని అలరిస్తూనే ఉంటాను అని చిరంజీవి అన్నారు.


# ఇరుముడితో రవితేజ కొత్త మూవీ

మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.




# 30న వస్తున్న విజయ్ సేతుపతి గాంధీ టాక్స్

టాకీ యుగం ప్రారంభమైన తర్వాత వచ్చిన అతి తక్కువ ప్రయోగాత్మక చిత్రాల్లో 'పుష్పక విమానం' ఒకటి. ఆ కోవలో మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మూవీ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది 'గాంధీ టాక్స్'. విజయ్ సేతుపతి, అదితీరావ్ హైదరీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుందీ సినిమా. ఈ నెల 30న థియేటర్లలో విడుదల కానుంది. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.




# మరోసారి పోలీసు అధికారిణిగా..రాణిముఖర్జీ

మహిళల అక్రమ రవాణా.. కిడ్నాప్ లాంటి అంశాలతో రూపొంది మంచి హిట్ బొమ్మ అనిపించుకున్నాయి 'మర్దానీ' చిత్రాలు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్‌ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమాలు ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఈ ఫ్రాంఛైజీలో 'మర్దానీ 3' రాబోతోంది. రాణి ముఖర్జీ మరోసారి పోలీసు అధికారిణి శివానీ రాయ్ పాత్రలో కనిపించనున్నారు. జనవరి 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# సెలెక్టెడ్‌గానే ఐటమ్ సాంగ్స్ చేస్తా: రష్మిక

ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు. ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు 'హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు' అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రష్మికపై భారీ ఆశలు పెట్టుకున్న కొంతమంది దర్శకులు ఈ షరతులతో కాస్త నిరాశకు గురైనట్లు సమాచారం. తెలుగులో లేడీ ఓరియెంటెడ్ సినిమా 'మైసా'లో కీలక పాత్రలో నటిస్తుండగా, విజయ్ దేవరకొండ 14వ సినిమాలోనూ హీరోయిన్‌గా ఎంపికైంది. మరోవైపు బాలీవుడ్‌లో 'కాక్‌టెయిల్ 2' వంటి పెద్ద ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. నటిగా, డాన్సర్‌గా తనను తాను విభిన్నంగా ప్రెజెంట్ చేసుకుంటూనే, అవసరమైతేనే ఐటం పాటలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నదే రష్మిక స్ట్రాటజీగా కనిపిస్తోంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986